1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | డిసెంబర్ 18, 2024 | www.navatelangana.com

19న మినీ జాబ్ మేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ కేంద్రంలో ఈనెల 19న ఉదయం 11 గంటలకు జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ. రవికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెడ్ ప్లస్ కరీంనగర్ సంస్థ ఆధ్వర్యంలో మంచిర్యాల, గోదావరిఖని, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాలలో పని చేసేందుకు 40 ఫార్మసిస్ట్ పోస్టులకు పీసీఐ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో కూడిన డీ, బీ ఫార్మసీ కలిగి ఉండాలని, 50 కస్టమర్ సపోర్ట్ అసోసియేట్, 100 జూనియర్ అసిస్టెంట్, 30 ఆడిట్ అసిస్టెంట్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదేని డిగ్రీ కలిగి ఉండాలని, 18-30 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9440514962, 9502786438, 9160608476 నెంబర్‌లలో సంప్రదించాలన్నారు. ఆసక్తి, అర్హత గల జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మ్యూజియంలో సదుపాయాలు కల్పించాలి

● భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్

నవతెలంగాణ-కెరమెరి



జోడేఘాట్‌లోని గిరిజన మ్యూజియంలో సదుపాయాలు కల్పించాలని కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్ కోరారు. మంగళవారం డీటీడీఓను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మ్యూజియంలో నెలకొన్న సమస్యలపై విన్నవించారు. కార్పెట్లు, కంప్యూటర్ సామాగ్రి, వీఐపీ కుర్చీలు, చెత్త బుట్టలు, పోడియం వద్ద ఏర్పాటు చేసే స్టాండ్లు, వీఐపీ మెజా బల్లలు, ఎల్ఈడీ ప్రాజెక్టర్‌తో పాటు గిరిజన సాంస్కృతి, ఉద్యమకారుల ఫోటో ఫ్రేమ్ తదితర వస్తువులను సమాకూర్చాలని వినతిపత్రంలో కోరారు.

బస్సులో మర్చిపోయిన మొబైల్ ఫోన్ అప్పగింత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఆసిఫాబాద్ నుండి చంద్రపూర్ ప్రయాణం చేసి బస్సులో మొబైల్ ఫోన్‌ను మర్చిపోయి విజయలక్ష్మి దిగిపోయారు. గమనించిన సిబ్బంది మొబైల్ ఫోన్‌ను తిరిగి అప్పగించారు. మంగళవారం ఆసిఫాబాద్ నుండి చంద్రపూర్‌కు ప్రయాణిస్తూ మొబైల్ ఫోన్‌ను బస్సులోనే మర్చిపోవడంతో డ్రైవర్, కండక్టర్లు గుర్తించి డిపో మేనేజర్ విశ్వనాథ్ సమాచారం అందించారు. ఈ విషయంపై విజయలక్ష్మి ఫిర్యాదు చేయగా తిరిగి ఆమెకు మహారాష్ట్రలోని రాజుర డిపో బస్ స్టేషన్‌లో కండక్టర్ కే.రమేష్ ఫోన్‌ను అప్పగించారు. దీంతో ఆర్టీసీ సిబ్బందిని పలువురు అభినందించారు.

కామన్ మెనూ విధానంతో ఇబ్బందులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అన్ని హాస్టల్లో ఒకే రకమైన మెనూ అమలు చేయడం వల్ల హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు ఇబ్బందులు తలెత్తుతాయని టీఎన్జీఓ జిల్లా కన్వీనర్ లింగాల రాజశేఖర్ అన్నారు. హెచ్‌డబ్ల్యూఓ ఫోరం సభ్యులతో కలిసి కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కామన్ మెనూ తీసుకురావడం సరైనదే అయినప్పటికీ దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ హాస్టల్లో వివిధ రకాల ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఆయా హాస్టళ్లకు ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధుల ఆధారంగా మెనూ రూపొందించాలని కోరారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారుల ఇబ్బందులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిఎన్జీఓ కోకన్వీనర్ హబీబ్, నాయకులు పొన్న కుమార్, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కలప దుంగల స్వాధీనం




నవతెలంగాణ-సిరికొండ

అక్రమంగా నిల్వ ఉంచిన కలప దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. జిల్లా టాస్క్‌ఫోర్స్ రెంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మండలంలోని బోరింగ్‌గూడ గ్రామంలో సోదాలు నిర్వహించారు. కినక గంగా ప్రసాద్, కినక భీంరావ్, కినక అర్జున్‌లు అక్రమంగా కలప దుంగలను నిల్వ ఉంచడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రెండు లక్షల విలువ గల కలపను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. చెట్లను అక్రమంగా నరికి వ్యాపారం చేయడం చట్ట రీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ దాడుల్లో డిప్యూటీ రేంజ్ అధికారి గీరయ్య కవిత, ఏఎస్సై రమేష్, ఎఫ్ఎస్ఓ మంజూర్ పాష, బీట్ అధికారులు సజన్‌లాల్, శ్యాంసుందర్, కలెందర్, ఆడే సంతోష్, ప్రవళిక, హిరలాల్, చరణ్ సింగ్, అవినాష్, సంతోష్, విజయ్ పాల్గొన్నారు.

సీఆర్టీలను క్రమబద్ధీకరించాలి

● సీఆర్టీల సమ్మెతో ఆశ్రమ పాఠశాలలు ఖాళీ



నవతెలంగాణ-నార్నూర్

సీఆర్టీలను క్రమబద్ధీ కరణతో పాటు వారికి ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించక పోవడంతో ఉట్నూర్ ఐటీడీఏ ఆవరణలో సమ్మె చేపట్టారు. కాగా ఈ సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఉమ్మడి మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీలు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బంది తప్పడంలేదు. పాఠశాలలో 20 ఏండ్ల నుంచి చాలిచాలని వేతనాలతో పని చేస్తున్నామని, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు.

బాధితుడికి పరామర్శ

నవతెలంగాణ-ఖానాపూర్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ కేహెచ్ ఖాన్ తండ్రి హబీబ్ ఖాన్ అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్యా జాన్సన్ నాయక్ మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని అంగడిబజార్‌లోని ఆయన నివాసంలో హబీబ్ ఖాన్‌ని పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఖానాపూర్ పట్టణ నాయకులు తాజామాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-మంచిర్యాల



క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని, క్రీడా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్ వీరుతో కలిసి కలెక్టర్ జిల్లా స్థాయి క్రీడలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సీఎం కప్ క్రీడలు జిల్లాలోని గ్రామపంచాయతీలు, మండల, మున్సిపల్ స్థాయి పోటీలను పూర్తి చేసుకుని ప్రతి మండలం, మున్సిపాలిటీ నుంచి ఒక టీం జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. మంగళవారం వాలీబాల్, బాస్కెట్‌బాల్, నెట్ బాల్, యోగ పోటీలు నిర్వహించడం జరిగిందని, 18వ తేదీన కబడ్డీ, బాక్సింగ్, తైక్వాండో, కిక్-బాక్సింగ్, 19న ఉషోదయ ఉన్నత పాఠశాలలో ఖోఖో, రెజ్లింగ్, బేస్‌బాల్, చెస్, సెవెన్‌హిల్స్ పాఠశాలలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ పోటీలు, 20వ తేదీన కరాటే, జూడో, హ్యాండ్‌బాల్, ఉషు, 21వ తేదీన హైటెక్ సిటీ క్లబ్‌లో బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, హత్యపతియా, టేబుల్ టెన్నిస్ ఇతర క్రీడాంశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్రీడా పోటీల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాస్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని, జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ క్రీడా పోటీలతో గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులలో దాగివున్న ప్రతిభను రాష్ట్రస్థాయికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల గదులు, వంటశాల, మధ్యాహ్న భోజన నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ఈ నెల 14న డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచడం జరిగిందని, విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య, షెడ్యూల్డ్ కులముల కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా షెడ్యూల్డ్ కులముల ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా రవాణా శాఖ అధికారి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమగ్ర శిక్షా ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట 8 రోజులుగా నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన ప్రకారం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్లని దుస్తులు ధరించి చెవిలో పువ్వుతో సామూహిక భోజనాలు చేస్తు నిరసన తెలిపారు. వాంకిడి మండల విద్యాధికారి వైరాగరే శివ చరణ్ కుమార్, జడ్పీఎస్‌ఎస్ ఖిరిడి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వైరాగరే ప్రబోధ్ కుమార్ సంఘీభావం తెలిపినారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షురాలు శృతిక, గౌరవ అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షురాలు నాగసుధ, ప్రధాన కార్యదర్శి తుకారం, కోశాధికారి నాగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, దుర్గం సందీప్, ప్రత్యేకాధికారిణి అరుణ, మీనా, నలంద, సీసీఓ సంఘం జిల్లా అధ్యక్షులు అనూప్ మహేష్, ఎంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, సీఆర్‌పీ అధ్యక్షుడు పవన్, రాజేష్, వెంకటేష్, పీజీసీఆర్‌టీలు అన్నపూర్ణ, స్వప్న, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, ప్రకాష్, తిరుపతి, శివరాం, ప్రసన్న, స్వప్న, సరస్వతి, సునీల్, సతీష్, పవన్ పాల్గొన్నారు.



రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణ సదుపాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాంతో కలిసి రాజంపేట తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌తో పాటు ఇతర తెలంగాణ గ్రామీణ బ్యాంక్ శాఖల ద్వారా జిల్లాలోని 105 స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.6 కోట్ల 89 లక్షల చెక్కును మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ కమిటీ క్రింద ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులలో స్వయం సహాయక సంఘాల మహిళలకు భాగస్వామ్యాన్ని కల్పిస్తూ పాఠశాలలలో మౌలిక సదుపాయాల కల్పన పనులను అప్పగించడం ద్వారా సంఘాల బలోపేతానికి ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్లు, ఇతర గుర్తించిన వ్యాపారాలలో అభివృద్ధి చెందేందుకు రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. మహిళాలు వీటిని సద్వినియోగం చేసుకుంటు రాణించాలని ఆకాక్షించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తమ పరిధిలో బాల్యవివాహాలు జరగకుండా పర్యవేక్షిస్తామని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, సెర్ప్ అధికారులు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శారద, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్వార్టర్ రిపేర్ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి, మాదారం టౌన్‌షిప్‌ల సివిల్ డిపార్ట్‌మెంట్‌లో క్వార్టర్ రిపేర్ పెండింగ్ దరఖాస్తులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షులు బయ్య మొగిలి అన్నారు. మంగళవారం గోలేటి జీఎం కార్యాలయంలో గుర్తింపు సంఘం అయినా ఏఐటీయూసీతో జీఎం స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలను లేవనెత్తగా జీఎం సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గోలేటి మరియు మాదారం టౌన్‌షిప్‌లకు కలుషిత తాగునీరు సరఫరా కారణంగా ఉద్యోగులు, కుటుంబాలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్‌ను అందించాలన్నారు. గోలేటి సీహెచ్‌పీలోని ఉద్యోగులు బొగ్గు రేక్ అవసరాలను తీర్చడానికి షిఫ్ట్ సమయాలకు మించి పని చేస్తున్నారని, కాబట్టి వారికి ఓటీ అందించాలన్నారు. గోలేటి భీమన్న స్టేడియంలో వాకింగ్ ట్రాక్ పూర్తిగా సిద్ధం చేయాలని, ఉద్యోగి మెరుగైన ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్‌ను అందించాన్నారు. గోలేటి, మాదారం వద్ద ఉన్న సూపర్ బజార్ కొన్ని నెలల నుండి మూసి ఉన్నాయని వాటిని అందుబాటులో తెలవాలని కోరారు. వీటిపై త్వరలోనే పరిష్కారం చూపుతామని జీఎం హామీ ఇచ్చారు. ఈ స్ట్రక్చర్ కమిటీలో జీఎం కమిటీ సభ్యులు శేషశైనారావు, జూపాక రాజేష్, సముద్రాల ఆనంద్, బి.జగ్గయ్య, మారం శ్రీనివాస్, దేవరకొండ దివాకర్, ఎంబడి రామయ్య పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐకి సంబంధించిన శిథిలావస్థకు చెందిన క్వార్టర్‌లలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను మంగళవారం అరెస్ట్ చేసినట్టు టౌన్ ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. పేకాట ఆడుతున్నరన్న పక్కా సమాచారం మేరకు టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించగా పేకాట ఆడుతున్న ఇ.చందు, ఆర్.సురేష్, ఎం.శ్రీనివాస్, జి.నరేష్‌లు పట్టుబడ్డారని, వారి నుండి రూ. 4,700 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. పేకాట, జూదం, మట్కా ఆడేవారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.



నెట్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఆదర్శ విద్యార్థులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్జీఎఫ్ అండర్-14 నెట్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఆదర్శ విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యర్థులు సప్తే అనూష, మాసగొని రోహన్ కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి నెట్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ దుర్గం మహేశ్వర్, ఎస్జీఎఫ్ కార్యదర్శి వెంకటేశం, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.తిరుపతి తెలిపారు. ఈనెల 25, 26 ఛత్తీస్‌ఘఢ్‌లో జరిగే ఎస్జీఎఫ్ అండర్-14 విభాగంలో జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక





నవతెలంగాణ-పెంచికల్‌పేట్

టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభ ప్రతినిధులు రాజకమలాకర్ రెడ్డి, భవిత తెలిపారు. నూతన మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సతీష్, ఉపాధ్యక్షులుగా షేక్ అబుతాల, సునీత, కోశాధికారిగా భాగ్యలక్ష్మి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వనిత, మహిళా కమిటీ కన్వీనర్‌గా వెన్నెలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

సర్వేను పూర్తి చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలను పూర్తి చేయాలని ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శులకు అందరూ సహకరించి సర్వేకు వచ్చినప్పుడు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వం త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేయడం కోసం సర్వే నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు సహకరించి సర్వేను విజయవంతం చేయాలని కోరారు.

న్యాయవాద గుమస్తాలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్ కోరారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1917లో ఏర్పడిన న్యాయస్థానంలో ఎందరో న్యాయవాదులు సేవలు అందించారని, జిల్లా కేంద్రంలో పలువురు న్యాయవాదులు న్యాయవాద గుమస్తాలు అద్దెకు ఉంటున్నారని తెలిపారు. జిల్లాకేంద్రంలో 5 ఎకరాల ఇండ్ల స్థలలను కేటాయించాలని కోరారు. దీనికిపై డీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో న్యావాదులు టి.సురేశ్, ముక్త సురేష్, మంతెన రామకృష్ణ, డి.వెంకటేశ్వర్లు, చందన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా రగ్ జోల్ యాత్రను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

ప్రజా రగ్ జోల్ యాత్రను విజయవంతం చేయాలని సేవ లాల్ సేన జిల్లా రాథోడ్ రూప్‌లాల్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రగ్ జోల్ యాత్రకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. రగ్ జోల్ యాత్ర 8న భద్రాద్రి కొత్తగూడెంలో ప్రారంభమైందన్నారు. ఈనెల 22న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు రానున్నట్లు తెలిపారు. 26న ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌లో ముగింపు ఉంటుందన్నారు. జిల్లాలోని లంబాడీ ప్రజలు, తండా నాయకులు, ఉద్యోగులు, విద్యావంతులు, కారొబారిలు, దావ్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అనార్‌పల్లి మాజీ సర్పంచ్ రాథోడ్ శేషారావ్, జాటోత్ తిరుపతి, అంబాజీ నాయక్, లాలు, పవార్ రాజు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | డిసెంబర్ 18, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కరిపే దయాకర్ తల్లి కరిపే రాజవ్వ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భుక్యా జాన్సన్ నాయక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట గోసంపల్లె ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన నాయుడి రాజన్నకు మంజూరైన సీఎం సహాయనిధి రూ.60వేల విలువ గల చెక్కును మంగళవారం కాంగ్రెస్ నాయకులు గాదె సంతోష్, కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాలశంకర్, నవీన్, మహేందర్, బొలిశెట్టి రాములు, ఉశన్న, పెదబాబు, రామకృష్ణ, ఇసాక్, రహిల్, ఆసిఫ్, కుంట శంకర్, నర్సయ్య పాల్గొన్నారు.



అవినీతి పనులపై రాజకీయ రచ్చ

- బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య విమర్శ, ప్రతివిమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు (ఫైల్)

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఒక పార్టీలో ఉన్న వారందరూ అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఒకరికొకరు సహకారం అందించుకొని, పార్టీ అభివృద్ధికి పాటు పడినవారు పార్టీలు మారే సరికి ఒకరికొకరు విమర్శలకు, ప్రతి విమర్శలు చేసుకోవడం స్థానికంగా చర్చనీయాంశమవుతోంది. యేడాది కాంగ్రెస్ పాలనపై, బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తుండగా, పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆ నాయకులు చేసిన అవినీతిని కాంగ్రెస్ నాయకులు ఎండగడుతున్నారు. ఎవరి ఆరోపణల్లో ఎంత నిజం ఉన్నా, ప్రజల్లో మాత్రం సదరు నాయకుల తీరు హాస్యాస్పదంగా మారుతోంది. నాలుగు రోజుల కింద మంత్రి సీతక్క ఖానాపూర్ పర్యటన నేపథ్యంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి విమర్శలు చేశారు. అభివృద్ధి పనుల ప్రారంబానికి వచ్చిన సీతక్కను బీఆర్ఎస్ నాయకులు విమర్శించడాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు పదేండ్లు అధికారంలో ఉండి, ఖానాపూర్ ప్రాంతానికి చేసింది ఏమీ లేదని తీవ్రంగా స్పందించారు. పదేండ్లు అవినీతి పనులతోనే పబ్బం గడిపారాని కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ క్రమంలో ఇరు పార్టీల నాయకుల మధ్యన రాజకీయ దుమారం తీవ్ర స్థాయికి చేరింది.

అవినీతిపై ఫిర్యాదులు..

ఆరోపణలు, ప్రత్యారోపణలతో రచ్చకెక్కిన నాయకులు పట్టణంలో జరిగిన అవినీతి పనులపై ఫిర్యాదులు చేసుకునే దాకా వెళ్లారు. పట్టణంలో జరిగిన పనులపై గతంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై ఫిర్యాదు చేయగా, రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గోదావరి నదీ తీరంలో నిర్మించిన శ్మశాన వాటిక, విద్యానగర్‌లో పార్క్, పసుపుల బ్రిడ్జి, తదితర పనుల్లో జరిగిన అవినీతిని కాంగ్రెస్ నాయకులు భయట పెడుతుండగా, పట్టణంలో అంతర్గత రోడ్లపై ఇటీవల పోసిన మట్టి పనులపై బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆ పార్టీలో ఉన్నప్పుడు అప్పటి నాయకులు చేసిన పనులకు మద్దతుగా నిలిచి సమర్థించిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు విమర్శిస్తున్నారు. అప్పుడు బీఆర్ఎస్‌లో ఉండి ప్రతిపక్ష నాయకుల విమర్శలను లెక్కచేయని పలువురు నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి వారుగా పోటీపడి చేసిన అవినీతిని చెప్పకనే చెబుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.

విజిలెన్స్ విచారణ జరిగేనా...?

గడిచిన ఐదేండ్ల కాలంలో పట్టణంలో అభివృద్ధి పేరుతో జరిగిన వివిధ పనులపై విజిలెన్స్ విచారణ చేస్తే ఏ స్థాయిలో అవినీతి జరిగిందో తేలిపోతుంది. అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, చైర్మెన్, పాలక సభ్యులు, అధికారులు కలిసి చేసిన పనుల్లో ఎవరి ప్రమేయం ఎంత అనేది భయటపడే అవకాశం ఉంటుంది. సదరు నాయకులు కోరుకుంటున్నట్టు అవినీతి పనులపై విజిలెన్స్ విచారణ జరుగుతుందా అనేది చూడాలి.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు (ఫైల్)

ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఐఈఓ రవిందర్ కుమార్



నవతెలంగాణ-ఇచ్చోడ

ఇంటర్మీడియట్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఐఈఓ సి. రవీందర్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మద్యాహ్న సమయంలో అల్పాహార కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఐఈఓ రవీందర్ కుమార్ మాట్లాడుతూ పరిపూర్ణ విద్యా విద్యార్థులకు అందాలంటే క్రమం తప్పకుండా కళాశాలకు రావాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్నం పూట అల్పాహారం అందించడానికి కృషి చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు సత్యనారాయణ, సోమేశ్, ప్రభాకర్ లను డీఐఈఓ అభినందించారు.

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కాంబ్లే విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కాంబ్లే విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశ పెట్టాలన్నారు. సీఆర్సి అమలు, డీఏ, పెండింగ్ బిల్లులన్నీ చెల్లించాలన్నారు. జీఓ నెంబర్ 5 ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడుగు మహేందర్, భగత్ బాపూరావు, భూమన్న పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడి నిరసన తెలిపిన ఉద్యోగులు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, నిర్మల్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపడుతున్న నిరవధిక సమ్మె కొనసాగుతుంది. సమ్మెలో భాగంగా ఉద్యోగులు మంగళవారం బతుకమ్మ ఆడి తమ నిరసనను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే 8 రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మండల విద్యాధికారులు మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గంగాధర్, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కానిందే రాజారామ్, సీనియర్ నాయకులు చిలుకూరి భూమన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో లగచర్ల ఘటనకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు బేడీలు వేసి జైళ్లలో నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని అన్నారు. రైతుల కుటుంబాలను హింసించడం దారుణమని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు లక్ష్మణ్, జనార్ధన్, శరత్, సాయి చైతన్య పాల్గొన్నారు.

ఖానాపూర్ : రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖానాపూర్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్య జాన్సన్ నాయక్ మాట్లాడుతూ లగచర్ల పేద గిరిజన, దళిత రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, రైతన్నలకు బేడీలు వేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

తలమడుగు : లగచర్ల రైతుల అరెస్టుకు నిరసనగా మంగళవారం సుంకిడి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ మండల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లగచర్ల రైతులు తమ భూములు ఇవ్వకుంటే బలవంతంగా లాక్కొని పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పూనుకుంటే పరిశ్రమలను నెలకొల్ప వద్దని రైతులు శాంతియుతంగా ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తే అరెస్టు చేసి బేడీలు వేస్తారా అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. బేషరతుగా రైతులను వెంటనే విడుదల చేయాలని. లేనిపక్షంలో రానున్న రోజుల్లో రైతులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, ఆ పార్టీ నాయకులు ఆశన్న యాదవ్, అబ్దుల్లా, సుదర్శన్‌రెడ్డి, మగ్గిడి ప్రకాష్, వెంకన్న, ప్రకాష్‌రెడ్డి, మహేష్ దేశ్‌ముఖ్, నర్సింలు, అభిరామ్‌రెడ్డి, గంగాధర్, అజయ్, శ్రీనివాస్, రామ్ కిషన్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా



వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ, మాజీ మంత్రి కేటీఆర్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ఆదేశాలమేరకు మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భారత్ చవాన్ మాట్లాడుతూ గిరిజనుల నుంచి అధికార అహంకారంతో బలవంతంగా భూములను లాక్కునే ప్రయత్నం చేశారని అన్నారు. అక్రమంగా కేసులు పెట్టి లంబాడి ఆడవాళ్ల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, పోలీసుల ద్వారా థర్డ్ డిగ్రీ ప్రయోగించారని అన్నారు. అన్నం పెట్టే రైతు అని చూడకుండా రైతులను జైలుకు పంపడం సరైంది కాదని మండిపడ్డారు. దానికి నిరసనగానే అరెస్టు చేసిన గిరిజన రైతులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, మండలాధ్యక్షులు పంద్రా జైవంతరావు, ధరణి రాజేష్, ఖలీమ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాంసి : లగచర్ల రైతులను అక్రమంగా అరెస్టు చేసిన రైతులను వెంటనే విడిచిపెట్టాలని మంగళవారం తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు ఆయా మండలాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ తాంసి జనరల్ సెక్రటరీ రమణ, భీంపూర్ మండల కన్వీనర్ నాగయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వినోద్ రెడ్డి, సంజీవరెడ్డి, అశోక్, మహేందర్, అనిల్, కాంతారెడ్డి, ఆశన్న, నర్సింగ్, సంతోష్, లింభాజీ, లింగం, కల్యాణ్, లక్ష్మిపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఫార్మా కంపెనీ కోసం రైతుల భూములను దౌర్జన్యంగా లాక్కునేల ప్రభుత్వం చేసిన కుట్రలను లగచర్ల రైతులు అడ్డుకున్నారని వారిపై అక్రమ కేసులు పెట్టడం సరైన విధానం కాదని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. లగచర్ల రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జోగు ప్రేమేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ప్రహ్లాద్, నాయకులు ప్రకాష్, గంద్రత్ రమేష్, సయ్యద్ సాజిదోద్దిన్, కొండ గణేష్, యూనిస్ అక్బానీ, సలీం పాషా, నారాయణ ఉన్నారు.

సిరికొండ : లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ప్రభుత్వం తక్షణమే ఎత్తివేయాలని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు ఓరగంటి పెంటన్న అన్నారు. మంగళవారం అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రాన్ని అందజేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు సూర్యకాంత్, రోహిదాస్, విజయ్ కుమార్, మల్లేష్, సునీల్, ప్రకాష్, మల్లారెడ్డి పాల్గొన్నారు.





సర్పంచుల ఆత్మహత్యలకు బీఆర్ఎస్‌దే బాధ్యత

నవతెలంగాణ-ఖానాపూర్

సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమైన బీఆర్ఎస్ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యత వహించాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ నిర్మల్ జిల్లా చైర్మెన్ బాణావత్ గోవింద నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌ని బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గత పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు బిల్లు ఇవ్వకుండా వారి ఆత్మహత్యలకు కారణమైందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వారి సమస్యల గురించి మాట్లాడటం సిగ్గుచేటని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల గురించి పట్టించుకోని మంత్రి హరీశ్‌రావు ఇప్పుడు అసెంబ్లీలో సర్పంచుల మొసలి కన్నీరు కార్చడం వాకౌట్ చేయడం హాస్యస్పందంగా ఉందని పేర్కొన్నారు.

ఆదివాసీ గిరిజన పిల్లలకు ఆధార్ కార్డులు జారీ చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ జిల్లా వైయస్సార్ కాలనీలో నివసిస్తున్న ఆదివాసీ గిరిజన కుటుంబాలు ఇతర ప్రాంతాల్లో జీవనోపాధి కోసం కూలి పనులకు వెళ్లే క్రమంలో పిల్లలకు జన్మనిచ్చారు. అవగాహనలేమి, తగిన సౌకర్యాల లేమి వల్ల ఆధార్ కార్డులు, ఇతర పత్రాలు తీయకపోవడం, అలాగే హాస్పిటల్‌లకు వెళ్లకుండానే జననాలు జరగడం వలన ఈ పిల్లలకు ఆధార్ కార్డులు తీసుకోలేదని, తక్షణమే అధికారులు స్పందించి, ఆధార్ కార్డులు జారీ చేయాలని తొడసం శంభు ఒక ప్రకటనలో కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల రాస్తారోకో



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 11 నెలల బిల్లులను వెంటనే విడుదల చేయాలని మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి లింగాల చిన్నన్న అన్నారు. మంగళవారం తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో అర గంటకు పైగా సాగడంతో వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. పోలీసులు ఆందోళనకారులను సముదాయించడంతో వారు రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు సీఎం రేవంత్‌రెడ్డి కార్మికులకు పది వేల రూపాయల వేతనం, సబ్సిడి కింద గ్యాస్, బిల్లులను సక్రమంగా అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన కూడా హామీలను అమలు చేయలేదన్నారు. 11 నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. బిల్లులు ఇవ్వకుండా విద్యార్థులకు పౌష్టికాహారం పెట్టమంటే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ మేరకు సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాళ్లు సంగీత, రేఖ, కవిత, లక్ష్మీ, సమీన, సఫీజ్, గంగామణి ఉన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్‌టౌన్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న సోన్, నిర్మల్‌టౌన్-1, నిర్మల్‌టౌన్-2, నిర్మల్‌టౌన్-3 సెక్షన్లకు చెందిన విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారించేందుకు పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నామని సీజీఆర్ఎఫ్ నిజామాబాద్ చైర్‌పర్సన్ నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 :30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గం వరకు సోన్ సబ్ స్టేషన్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు హాజరై సమస్యలు పరిష్కరించేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ భవనానికి స్థల పరిశీలన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని కొండపెల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవనం కోసం స్థలాన్ని తహసీల్దార్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. గ్రామంలో ప్రభుత్వ భూమి లేకపోవడంతో అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం ఎవరైనా దాతలుంటే భూమి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, మాజీ సర్పంచ్ పరదేశి, గ్రామస్తులు పురుషోత్తం, చంద్రు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆదేశించారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఆదర్శనగర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన పరిశీలించారు. కుటుంబ యజమానుల నుండి సేకరించిన వివరాలను ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదు చేసే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా సర్వే సిబ్బందికి సూచించారు. ప్రతీ 500 ఇండ్లకు ఒక సర్వే అధికారిని నియమించడం జరిగిందనీ, వారు క్షేత్రస్థాయిలో చేపడుతున్న సర్వేను ఎప్పటికప్పుడు పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్యను ఆదేశించారు. కలెక్టర్ వెంట కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో పాటు గృహ నిర్మాణశాఖాధికారులు, సర్వే సిబ్బంది ఉన్నారు.

క్రీడాకారుల గ్రామం గోలేటి



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి మారుమూల గ్రామం అయిన క్రీడాకారులకు పుట్టినిల్లు లాంటిదని జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ 91వ వార్షిక క్రీడా పోటీలలో భాగంగా గోలేటిలోని శ్రీ భీమన్న క్రీడా మైదానంలో కంపనీ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఒలంపిక్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న ఏరియా అయిన బెల్లంపల్లి ఏరియాపై నమ్మకంతో కంపనీ స్థాయి పోటీలు నిర్వహించేందుకు అవకాశం ఇచ్చినందుకు ఉన్నత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గోలేటి మారుమూల ప్రాంతం అయిన ఇక్కడి యువత క్రీడాకారులుగా ఎదుగుతున్నారన్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల కోసం క్రీడాకారులు, రేఫరీలకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఏరియాతో సంబంధం లేకుండా మంచి సింగరేణి జట్టును ఎంపిక చేసి కోల్ ఇండియా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. అనంతరం మాదారం ఎల్‌బీ మైదానానికి చేరుకొని క్రీడాకారులను ప్రోత్సహించారు. గోలేటి శ్రీభీమన్న మైదానంలో ఉదయం బెల్లంపల్లి, మందమర్రి జట్టు ఆర్‌జీ-3 భూపాలపల్లి జట్ల మధ్య జరిగిన పోటీలో మందమర్రి, బెల్లంపల్లి జట్టు గెలుపొందింది. మధ్యహ్నం శ్రీరాంపూర్ జట్టు ఆర్జీ-3 భూపాలపల్లి జట్ల మధ్య జరిగిన పోటీలో శ్రీరాంపూర్ గెలుపొందింది. మాదారం ఎల్‌బీ మైదానంలో ఉదయం ఆర్జీ-1, ఆర్జీ-2 జట్టు మణుగూరు, ఇల్లందు జట్ల మధ్య జరిగిన పోటీలో ఆర్జీ-1, ఆర్జీ-2 జట్టు గెలుపొందింది. మణుగూరు, ఇల్లందు జట్టు కొత్తగూడెం, కార్పోరేట్ జట్ల మధ్య జరిగిన పోటీలో మణుగూరు, ఇల్లందు జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎస్.తిరుపతి, ఎస్ఓటుజీఎం కె.రాజమల్లు, ఏరియా సెక్యూరిటి ఆఫీసర్ ఉమాకాంత్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ ఆర్.తిరుపతి, సీనియర్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ డి.జాన్ వెస్లీ, ఎస్ఈ(సివిల్) మదీనా బాషా, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్ పాల్గొన్నారు

ఉచిత కంటి శిబిరాలకు స్పందన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని వివిధ ఆస్పత్రులలో మంగళవారం వేర్వేరుగా నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరాలకు అనూహ్య స్పందన లభించింది. స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి పరీక్షా శిబిరానికి 29 మంది హాజరు కాగా ఇందులో ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో దశలవారీగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత దంపతులు తెలిపారు.

ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాలైఫ్ కేర్ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 28 మందిని పరీక్షించగా, ఇందులో 21 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి విడతల వారీగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని కంటి శుక్లాలున్న వారు, కంటి చూపు మందగించిన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మెనూ పాటించాలి : ఎంఈఓ



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ తప్పకుండా పాటించాలని ఎంఈఓ గావుడె హనుమంతు అన్నారు. మంగళవారం మండలంలోని ఛీవరెట్టి ప్రాథమిక పాఠశాలను ఉదయం ప్రార్థన సమయానికి ముందే ప్రార్థనలో పాల్గొన్నారు. అదే విధంగా గోవరెట్టి, తాటిపెల్లి, కేజీబీవీ పాఠశాలలను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నోటుబుక్స్ పరిశీలించి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన కార్యక్రమంలో భాగంగా మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని, పరిశుభ్రమైన వంటకాలు వడ్డించాలని తెలియజేశారు. అదేవిధంగా కేజీబీవీ పాఠశాలను పరిశీలించి మధ్యాహ్న భోజన కార్మికులకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మెనూ పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

19న ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య మహాసభ నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటలకు కాగజ్‌నగర్ పట్టణంలోని వాసవి గార్డెన్స్‌లో నిర్వహించే ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కాల్వ సుజాత, రాష్ట్ర ఉపాధ్యక్షులు నలమాసు కాంతయ్య, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు ఉప్పల శారద, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు ఇరుకుల్ల రామకృష్ణ, పోలీసు హౌజింగ్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆర్యవైశ్యులు హాజరు కావాలని కోరారు.

వేతనాలు పెంచాలని అసెంబ్లీలో చర్చించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచుతూ సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీల చర్చించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వంటవార్పు నిర్వహించారు. ఈ సందర్భంగాదాయన మాట్లాడుతూ కోడి గుడ్ల బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని, వేతనాలు కూడ కేంద్రం చెల్లించే వాటా ఒకసారి రాష్ట్ర వాటా ఒకసారి చెల్లింపులు చెయ్యకుండా ఓకే సారి పూర్తి వేతనం చెల్లించేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వంటవర్పా చేపట్టామన్నారు. కార్మికులను గుర్తించి మెనూ చార్జీలు ఒక్కొక్క విద్యార్థికి కనీసం రూ 20 ఇవ్వాలని, కోడిగుడ్లకు అధనంగా బడ్జెట్ కేటాయించాలని, వయస్సుపైబడి రిటైర్డ్ అవుతున్న కార్మికులకు రూ.3 లక్షలు రిటైర్డ్‌మెంట్ బెన్ఫిట్ ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పథకం ప్రయివేటీకరణ ఆపాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు సీఎం ఎన్నికల మెనిఫెస్టోలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రకటించిన రూ.10వేల వేతనం వెంటనే చెల్లించాలని, ఇతర సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలపై చర్చఇంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శారద, మాయ, గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి, కోశాధికారి రూప, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అధికారులు సమన్వయంతో పనిచేసే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రహదారి భద్రత కమిటీ సమావేశానికి ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావు, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి జాతీయ రహదారులు, రోడ్లు భవనాల, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్, రవాణ, పురపాలక, పంచాయితీ రాజ్ శాఖల అధికారులతో రహదారులపై ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారుల ప్రమాదాల నివారణకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. రహదారులపై ప్రయాణించే వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్‌లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనదారులకు తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రహదారులు, కల్వర్టులు, వంతెనల వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని, అనుబంధ రహదారుల వద్ద వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. రహదారులపై స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేయాలని, మద్యం తాగి వాహనాలు నడపకుండా తనిఖీలు చేయాలని ఆదేశించారు. రాంగ్ రూట్‌లో వచ్చే వారి అధికంగా ప్రమాదాలకు గురవుతున్నారని, రహదారులపై పశువులు సంచరించకుండా ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జూనియర్ కళాశాలలలో ప్రమాదాల నియంత్రణపై పాటించాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించాలన్నారు. రహదారులను అనుకొని ఉన్న జన్నింగ్ మిల్లుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, రహదారులు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ఎస్పీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం 139 ప్రమాదాలు జరిగాయని, ఈ సంవత్సరం జనవరి నుండి నవంబర్ నెల వరకు 133 ప్రమాదాలు జరిగినట్టు వివరించారు. రాంగ్ రూట్, హెల్మెట్ లేని ప్రయాణం, ఇతర రోడ్డు భద్రత నియమాలు, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాహనదారులు భద్రత నియమాలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, రోడ్డు భవనాల శాఖ ఈఈ శైలేందర్, జిల్లా రవాణా శాఖ అధికారి రాంచందర్, జాతీయ రహదారుల సంస్థ, పంచాయతీరాజ్, ఆర్టీసీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



గడువులోగా సర్వే పూర్తి చేయాలి

ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల ఇంటింట సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్ గ్రామపంచాయతీలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు గతంలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయాలని, సర్వే ప్రక్రియలో భాగంగా ప్రతి 500 ఇండ్లకు ఒక సర్వే అధికారిని నియమించామని, నిర్ణీత గడువులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన లబ్దిదారులను గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, సర్వే అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో రైతులపై మోపిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో ఆయన కాగజ్‌నగర్‌లోని అంబేద్కర్ చౌక్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్లలో పేద రైతుల భూములను లాక్కొని, వారికి జీవనాధారం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. తమ జీవనాధారాన్ని కాపాడాలని రైతులు పది నెలలుగా కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం పక్కన పెట్టి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైలుపాలు చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలకు సద్బుద్ధిని ప్రసాదించాలని, రైతులను కాపాడాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అసెంబ్లీ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని బీఆర్ఎస్ నాయకులు పునరుద్ఘాటించారు. లగచర్లలో రైతులను అరెస్టు చేయడం నిరసిస్తూ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అంబేద్కర్ చౌక్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ రైతులను ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందన్నారు. లగచర్ల రైతులకు అండగా ఉండి పోరాడుతామన్నారు. రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ అలీబిన్ అహ్మద్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలువేరు వెంకన్న, గంధం శ్రీనివాస్, మాజీ సర్పంచులు భీమేష్, నాయకులు నిసార్, సలాం పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో బస్ డిపో ఏర్పాటు చేయాలి

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే హరీష్‌బాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలో బస్ డిపో ఏర్పాటు చేయాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అసెంబ్లీలో కోరారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ తన తండ్రి పాల్వాయి పురుషోత్తంరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణంలో బస్టాండ్ నిర్మాణం జరిగిందనీ, అదే సమయంలో బస్ డిపో ఏర్పాటుకు కూడా విలువైన స్థలాన్ని సేకరించినట్లు వివరించారు. ప్రస్తుతం ఆ విలువైన భూమిని కబ్జా చేసేందుకు పలువురు యత్నిస్తున్నారని, మారుమూల ప్రాంతమైన కాగజ్‌నగర్‌లో బస్ డిపో ఏర్పాటు చేస్తే ఆర్టీసీకి చెందిన విలువైన భూమి అన్యాక్రాంతం కాకుండా నివారించడమే కాకుండా బస్ డిపో ఏర్పాటు ద్వారా నియోజకవర్గ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడే అవకాశముంటుందని అసెంబ్లీలో ప్రస్తావించారు.

లా విద్యార్థి మరణానికి కారణమైన వారిని శిక్షించాలి



నవతెలంగాణ-వాంకిడి

ఇటీవల మహారాష్ట్రలో పర్భని పట్టణంలో భారతీయ రాజ్యాంగాన్ని చించివేసిన ఘటనపై గళం విప్పిన లా విద్యార్థి సోమనాథ్ వెంకట్ సూర్య వంశి మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోనీ జేత్వాన్ బుద్ధ విహార్ ముందు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భారతీయ బుద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్, మండలాధ్యక్షుడు జైరాం మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ విగ్రహం ఎదురుగా కొందరు దుండగులు రెండు రోజుల ముందు చింపేసిన ఘటనలో సోమనాథ్ సూర్య వంశీ అనే లా విద్యార్థిని పోలీసులు అమానుషంగా అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేసి పోలీసు లాకప్‌లోనే చంపడం ఇది యావత్ భారతదేశానికి సిగ్గుచేటన్నారు. సోమనాథ్ సూర్యవంశం భీమయోధునికి సోమవారం జేత్వాన్ బుద్ధ విహార్‌లో భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ యువజన సంఘం, సిద్ధార్థ యువజన సంఘం, షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నాయకులు సోమనాథ్ సూర్యవంశీ చిత్రపటానికి, భారత రాజ్యాంగానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాల అర్పించారు. తరువాత శ్రీ శరణ పంచశీల్, బుద్ధవందన ఆలపించారు. మహారాష్ట్రలోని పర్భని జిల్లాలో జరిగిన ఘటన చాలా సిగ్గుచేటని అన్నారు. దేశంలోనే మనువాదుల రాజ్యం ఏలుతుందన్నారు. మహారాష్ట్ర సర్కారు వెంటనే దుండగుల్ని అరెస్టు చేసి ఉరిశిక్ష విధించాలని, పర్భాని జిల్లాలోని అధికారులను కలెక్టర్, ఎస్పీని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు హంస రాజ్, సమాజ అధ్యక్షులు విలాస్, రాజేంద్ర ప్రసాద్, నాయకులు రాంటెంకి ప్రతాప్, సిద్ధార్థ యువజన సంఘం అధ్యక్షులు కొయ్యల మహేష్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘం నాయకులు దుర్గం శ్యామ్ రావు, దుర్గం లాహుజీ, అరుణ్ మహల్కార్, సురేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నుంచి యువతను కాపాడాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

యువత సైబర్ నేరాల బారిన పడకుండా విశ్రాంత ఉద్యోగులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజన్ అన్నారు. పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాగజ్‌నగర్ రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి డీఎస్పీ రామానుజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెన్షన్ విధానాన్ని తీసుకువచ్చిన డీఎస్ సకారా చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం పెన్షనర్లను సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు తమ పిల్లలు, మనుమలు, మనుమరాళ్ల సెల్ వాడకం విషయంలో అప్రమత్తంగా ఉంటూ వారు సైబర్ నేరాలకు గురికాకుండా కాపాడుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణాగౌడ్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సదానందం, కాగజ్‌నగర్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు జయదేవ్ అబ్రహం, శివప్రసాద్ నాయర్, సభ్యులు ఎఎస్ఆర్ మూర్తి, బావండ్లపల్లి నర్సయ్య, ఎం.సుభాష్, అన్వరుద్దీన్, కె నర్సయ్య, పురుషోత్తం, కె.లింగమ్మ, జయప్రద, షేక్ మహబూబ్, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుమిషన్లకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మైనారిటీ (ముస్లీం, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీ) మహిళలకు అందిస్తున్న ఉచిత కుట్టుమిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆర్.రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల మహిళలు ఈనెల 31 సాయంత్రం 5.30 గంటలలోగా టీజీఓబీఎంఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు ప్రతిని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు, ఆహార భద్రత కార్డు కలిగి గ్రామీణ ప్రాంతాలలో రూ. లక్ష50 వేలు, పట్టణ ప్రాంతాలలో రూ.2 లక్షల వార్షిక ఆదాయం కలిగి ఉండాలని, ఆధార్ కార్డు, 18-55 సంవత్సరాల వయసు, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వారా శిక్షణ పొందిన టైలర్ సర్టిఫికెట్, కనీస విద్యార్హత 5వ తరగతి కలిగి ఉండాలని, ఆసక్తి, అర్హత గల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతునేస్తంను సద్వినియోగించుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని ప్రతి రైతు రైతునేస్తం కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని మంచిర్యాల జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు బి.ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని పోనకల్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొని రైతునేస్తం కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ యాసంగి పంటలో సస్య సంరక్షణ చర్యలపై డాక్టర్ ఎస్. మాలతి తెలిపిన సలహాలు, సూచనలను రైతులు పాటించాలన్నారు. అనంతరం డీఆర్‌డీఏ వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి తప్పిదాలు లేకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని సంగీత, విస్తరణ అధికారులు త్రిసంధ్య, దివ్య, సాయి, లవన్‌కుమార్, అక్రమ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ దినోత్సవం

నవతెలంగాణ-జన్నారం



రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సంఘ భవనంలో మంగళవారం పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ మహేష్ రిటైర్డ్ ఉద్యోగుల సేవలను అభినందించారు. సీనియర్ సిటిజన్స్ తరఫున రిటైర్డ్ ఉద్యోగులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్, జిల్లా సంఘ అధ్యక్షుడు డి.కృష్ణ, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, మల్లయ్య, కనకయ్య మండల అధ్యక్షుడు అడ్డగూరి భూమన్న, సెక్రటరీ కస్తూరి నాగేశ్వర్, ఉపాధ్యక్షులు దేవయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ భాస్కర్ గౌడ్, ట్రెజరర్ కూకటి కారి బుచ్చన్న మురళి, తారచంద్, పి రాజయ్య, సత్యనారాయణ, నాయిని లచ్చన్న, దుర్గా ప్రసాద్, గంగామణి, శారదా పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలకు ప్రాధన్యత ఇవ్వాలి



నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్వార్డు పేషెంట్లను అవుట్ పేషెంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్, ల్యాబ్, వివిధ విభాగాలు, వార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను అక్కడే ఉన్న రోగులను అడిగి తెలుసుకున్నారు. వసతి సౌకర్యాలను గురించి రోగులను అడిగారు. వైద్య నిపుణులను నియమించాలని రోగులు కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ ఆసుపత్రికి క్యాడర్ స్టెంన్త్ జీఏ జారీ చేసేలా రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు నివేదించనున్నట్టు తెలిపారు. ఇక్కడ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఏర్పాటుకు ప్రతి పాదనలు పంపాలని అధికారులకు సూచించారు. ఎక్కువ ప్రసవాలు జరిగేలా చూడాలని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జీడి రవికుమార్ ఆదేశించారు. ఆస్పత్రి ప్రహరీ నిర్మాణం కోసం ప్రతి పాదనలు పంపాలని సూచించారు. ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది నియామకానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

పత్తి దిగుబడుల పూర్తిస్థాయి కొనుగోలు చేస్తాం

నవతెలంగాణ-తాండూర్

రైతుల వద్ద నుండి పత్తి దిగుబడులను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని మార్కెట్ సెక్రటరీ భాస్కర్ తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని దశలవారీగా తమ పత్తిని మార్కెట్‌కు తరలించాలని కోరారు. సీసీఐకి అమ్మకానికి తీసుకువచ్చే పత్తి నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉండాలని కోరారు. నిధులు పత్తి తీసే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నస్పూర్





రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం నస్పూర్ పట్టణ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సీసీసీలోని సంఘం కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. కార్యదర్శిగా గొట్టం తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా దూదిపాల విజయపాల్‌రెడ్డి, నస్పూర్ మున్సిపాలిటీ గౌరవాధ్యక్షుడిగా అనుమాండ్ల వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడిగా మోతె రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పాకాల మహిపాల్‌రెడ్డి, కోశాధికారిగా చెరుకు చంద్రశేఖర్‌రెడ్డి, అధికార ప్రతినిధిగా ఆళ్ల రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఏడుగురు, కార్యదర్శులుగా ఆరుగురు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎనిమిది మంది, ముఖ్య సలహాదారులుగా పది మంది, సలహాదారులుగా నలుగురిని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం రెండేళ్లపాటు పనిచేస్తుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఆస్పత్రి భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేశాయలని డీసీహెచ్‌ఎస్ కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం ఐసీయూ, ఆక్సిజన్ వార్డులను సందర్శించారు. అన్ని వార్డులను అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

నవతెలంగాణ-జన్నారం

ఎస్సీ తెగలో ఉన్న 59 కులాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు చేపట్టాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండుకూరి రాజు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వ ఏక సభ్య కమిషన్ చైర్మన్ షమీం అత్తర్ ఆధ్వర్యంలో మంగళవారం షెడ్యూల్ క్యాస్ట్ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందించారు. రాష్ట్ర అధ్యక్షుడు మొండి కత్తి లింగన్న, వ్యవస్థాపకులు మర్మంగుల మల్లేష్, కందుల సాయినాథ్ పాల్గొన్నారు.



రైతులను వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. లగచర్ల రైతులను దేశ తీవ్రవాదులుగా సంకెళ్లు వేయడం, థర్డ్ డిగ్రీ ఉపయోగించి నెల రోజులుగా బెయిల్ మంజూరు కాకుండా చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నియంతలా పరిపాలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని, ఎన్నికల సంధర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉప సర్పంచులు బోయిని తిరుపతి, దుర్గం సూర్య ప్రకాశ్, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటింకి వాసుదేవ్, కాసిపేట గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, వ్యవసాయ కమిటీ సభ్యుడు జాడి రాంచందర్, నాయకులు లంక లక్ష్మణ్, అక్కెపల్లి బుగ్గరాజు, సుధాకర్‌రెడ్డి, దుర్గం సాగర్, గంగాధరి రాజేశం, కుమ్మరి శేఖర్, గుమాస సుధాకర్, సత్రవేణి మల్లేశ్, భీంరావు, నవీన్, యూత్ నాయకులు బోయిని సాయి కిరణ్, జీకే కేశవ్, ఎస్ అలీం, గిన్నె సత్తి, పేరం మల్లేశ్ పాల్గొన్నారు.



జన్నారం : లగచర్ల రైతులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుల్వా జనార్ధన్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు బేడీలు వేసి అరాచక పాలన కొనసాగిస్తుందన్నారు. రైతులను అన్ని విధాల ఆదుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గురు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు, రైతు బీమా ఇవ్వకుండా హరిగోస పెడుతుందని అన్నారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ వైస్ ప్రెసిడెంట్ వినయ్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి సిటీమల భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు జాడి గంగాధర్, పట్టణ అధ్యక్షుడు బాలసాని శ్రీనివాస్ గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఫజల్ ఖాన్, ఆంధ్ర పురుషోత్తం, ఒలాల నరస గౌడ్, రాములు నాయక్ నరేష్, కడార్ల నరసయ్య, రవి ముదిరాజ్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీ నారాయణ, లెక్కల మల్లయ్య లక్ష్మణ్ పాల్గొన్నారు.

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు హామీలు నెరవేర్చాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాలు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య బ్రాంచ్ సెక్రటరీ అనిల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌కే-7 గనిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇన్‌కం టాక్స్ మాఫీ, ప్రతి కార్మికునికి 250 గజాల భూమి, రూ. 20 లక్షల వడ్డీ లేని రుణం, ఏడాదికి 5 బొగ్గు గనులు, మారు పేర్లు క్రమబద్ధీకరణలాంటి అనేక హామీలు ఇచ్చి ఈ రెండు సంఘాలు విస్మరిస్తున్నాయని విమర్శించారు. ప్రతి కార్మికునికి 250 గజాల భూమి చొప్పున ఒక్క శ్రీరాంపూర్ ప్రాంతంలోని 9 వేల మంది కార్మికులకు సుమారు 700 ఎకరాలు భూమి అవసరమని, సింగరేణి వ్యాప్తంగా సుమారు 38 వేల మంది కార్మికులకు దాదాపు 1500 ఎకరాల భూమి అవసరమని అన్నారు. సింగరేణి సంస్థ ఆధీనంలో ఎంత భూమి ఉందో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులు చెప్పాలని అన్నారు. కార్మికులను నమ్మించి హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాలను గనుల వద్ద కార్మికులు నిలదీయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కేవలం మెడికల్ దందాలు, ప్రమోషన్లులాంటి పైరవీలకే పరిమితమై కార్మికులను ఆర్థిక దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. సింగరేణి కార్మికులంతా హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఆదాయ పన్ను రద్దు కోసం చేపడుతన్న పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు దుర్గం లక్ష్మణ్, రాజేంద్రప్రసాద్, మీసా కొమురయ్య నోముల బాలయ్య చెవుల శ్రీనివాస్ మీసాల మహేంద నామాల శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

2వ గనిపై ఐఎన్టీయూసీ బాయిబాట

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2వ ఇంక్లెయిన్ గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గని మేనేజర్ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లగా పరిష్కారానికి హామీ ఇచ్చారని అన్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య, చీఫ్ ఆర్గనైసింగ్ సెక్రటరీ రాంశెట్టి నరేందర్ పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. కార్మికులకు ఏ సమస్య వచ్చిన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. వచ్చే 5 ఏళ్లలో 7 నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేయించి సింగరేణికి ఉజ్వల భవిష్యత్ కల్పించబోతున్నామన్నారు. అనంతరం బీఎంఎస్ ఏరియా నాయకులు పల్కపాటి సంతోశ్ ఐఎన్టీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కాసిపేట-2 గని ఫిట్ సెక్రటరీ కారుకూరి తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ చింతం రవికిరణ్, ఏరియా సెక్రటరీలు దొరిశెట్టి చంద్రశేఖర్, మండ భాస్కర్, హెడ్ ఓవర్మెన్ లింగాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు గాలి పరమేశ్వర్, చింతం సత్తయ్య, తొంగల కుమార్, గొల్ల రాజేందర్, గంగుల శ్రీనివాస్, యువ నాయకులు అవునూరి రవి, దేవేందర్‌రెడ్డి కార్మికులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు వేతనాలు చెల్లించాలని మినీ టీచర్లకు అందాల్సిన వేతనాలు సమయానికి అందడం లేదని, రిటైర్ అయినా టీచర్ ఆయాలకు రావాల్సిన బెనిఫిట్స్ టీచర్లకు రూ.2 లక్షలు ఆయాలకు రూ. లక్ష ప్రభుత్వ వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. టీచర్లకు గతంలో ఇచ్చిన 3జీ ఫోన్‌లు పని చేయడం లేదని ల్యాప్టాప్స్ అందించే వరకు టీచర్‌లపై ఒత్తిడి తుసుకురావద్దని ఖాళీగా ఉన్న టీచర్ ఆయాల పోస్టులు భర్తీ చేయాలనీ కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేసి పని చేస్తున్న ఆయాలకు వయసుతో సంబంధం లేకుండా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. అనంతరం ఎఐటీయూసీలో చేరిన పలువురు అంగన్‌వాడీ టీచర్లకు కండువ కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కార్యక్రమంలో రమాదేవి, కుసుమ, కుమారి అరుణ, తిరుమల, శంకరమ్మ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు ఖాళీందర్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసులు పంపిణీ

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం మహిళా తరంగిణి మమత ఆధ్వర్యంలో 100 గ్లాసులను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ మంజుల కృష్ణారావు, ఇరుకుల లత, ట్రెజరర్ శ్రీదేవిగౌడ్, అంబికా పాల్గొన్నారు.



నిరంతరాయంగా నీటిని అందించాలి



నవతెలంగాణ-తాండూర్

నిరంతరాయంగా ఇంటింటికి మిషన్ భగీరథ మంచినీరు సరఫరా చేయాలని మిషన్ భగీరథ ఇంట్రా డీఈ ప్రవీణ్ అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి పంచాయతీ సెక్రెటరీలకు మంచినీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ సెక్రెటరీలు మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం నిర్వహించాల్సిన 8 రిజిస్టర్లలో వివరాలను తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. గ్రామపంచాయతీలలో ఉన్న వాటర్ ట్యాంకులు నిండిన ప్రతిసారి బ్లీచింగ్ పౌడర్ కలిపిన తర్వాతే సరఫరా చేయాలన్నారు. నీటిని క్లోరినేషన్ కిట్ల ద్వారా పరీక్షించాలని సూచించారు. 1, 11, 21 తేదీలలో ట్యాంకులు క్లీన్ చేసి క్లీనింగ్ రిజిస్టర్‌లో, మంచినీరు వినియోగిస్తున్న లబ్ధిదారుల వివరాలను సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. లీకేజీకి వివరాలు లీకేజీ రిజిస్టర్‌లో, కనెక్షన్ కోసం నూతనంగా దరఖాస్తు చేసుకునే లబ్ధిదారుల వివరాలను సైతం రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ మనోహర్ పంచాయతీ సెక్రటరీలు దివాకర్ కల్పన, రమాదేవి, వసంత, సౌందర్య, కార్తీక్ పాల్గొన్నారు.

జాతీయ మహా సభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-మందమర్రి

హైదరాబాద్‌లో జనవరి 5,6,7వ తేదీలలో జరిగే అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం 2వ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కామెర దుర్గారాజ్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా నిర్మాణ బాధ్యులు దాగం మల్లేష్, జిల్లా కార్యదర్శి దేవి పోచన్న మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏళ్ల పూర్తయినా దళిత వర్గాల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు నేటికీ దళితుల దరిచేరడం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, దళితుల వాటా కోసం సమరానికి సిద్ధం కావాలన్నారు. సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించకుండా స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని అన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, దళితుల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకై జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు పలిగిరి కనకరాజు, డీహెచ్‌పీఎస్ నాయకులు నక్క వెంకటస్వామి, మామిడి గోపి, నాగుల వెంకటేష్, ఉప్పులేటి తిరుపతి, కామెర సదానందం పాల్గొన్నారు.

పర్యవేక్షణలో పత్తి కొనుగోళ్లు సాగాలి

● బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో పత్తి కొనుగోళ్లను తూనికలు కొలతల శాఖ ప్రతినిత్యం పర్యవేక్షించాలని బెల్లంపల్లి ఆర్డీఓ హరికష్ణ సూచించారు. మంగళవారం శ్రీరామ జిన్నింగ్, శ్రీనివాస జిన్నింగ్ మిల్లులను సందర్శించి పత్తి కొనుగోలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీఐ అధికారులు తూనికలు కొలతల శాఖ పర్యవేక్షణలో కొనుగోలు జరపాలన్నారు. మిల్లులను సందర్శించి రైతుల సమస్యలను తీసుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. తూకంలో రైతుకు ఎలాంటి నష్టం వాటిల్ల రాదన్నారు. కొనుగోలు చేసిన పత్తి పంట డబ్బులను వెంటనే రైతు ఖాతాలో జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సీసీఐ అధికారులకు సూచించారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. టోకెన్ల కేటాయింపు విషయంలో పారదర్శకత పాటించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మిల్లు యజమాని ప్రవీణ్ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని జన్నారం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ కోరారు. మంగళవారం మండలంలోని ధర్మారం, కామన్పల్లి గ్రామాలలో సికిల్‌సెల్, ఎనీమియా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత రాదన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం ప్రభుత్వ వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
5
ఆదిలాబాద్
బుధవారం | డిసెంబర్ 18, 2024 | www.navatelangana.com

మూడు మండలాలు ఏర్పాటు చేయండి : రామారావ్ పటేల్

నవతెలంగాణ-భైంసా



ముధోల్ నియోజకవర్గంలో కొత్తగా మూడు మండలాలు ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కోరారు. బేల్ తరోడ, పల్సి, మాలేగాంలను మండలాలుగా ప్రకటించాలని తన ప్రసంగంలో కోరారు. 30 మండలాలను ఏర్పాటు చేస్తున్నట్టు జారీ చేసిన జీఓలో తమ నూతన మండలాల పేర్లు లేవని, తక్షణమే జాబితాలో చేర్చి కొత్త మండలాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేల విన్నపాన్ని పరిగణలోకి తీసుకుంటామన్నారు.

మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని చించోలి(బి) మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో సుమారు 80 మంది విద్యార్థులకు విరోచనాలు కావడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అత్యావసరంగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ వేదవ్యాస్ విద్యార్థులకు చికిత్సలు అందజేశారు నలుగురికి విరోచనాలు ఎక్కువగా ఉండడంతో వారిని నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందేలా చర్యలు తీసుకున్నారు. ఫుడ్ పాయిజన్ కారణంగా విరోచనాలు అయినట్టు ప్రచారం జరగడంతో వైద్యాధికారి వేదవ్యాస తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అనారోగ్య సమస్యలున్న వారిని కూడా పరిశీలించి చికిత్సలు అందజేశారు. విరేచనాలు జరగడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదన్నారు.

పథకాల అమలులో విశ్రాంత ఉద్యోగుల పాత్ర

- ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు
- పాల్గొన్న కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పథకాల అమలులో విశ్రాంత ఉద్యోగుల పాత్ర ఎంతో ఉంటుందని, ఇటీవల జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో వారు అందించిన సహకారం ఎంతో ఉందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం టీఎన్జీఓ భవనంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ డేను పురస్కరించుకొని విశ్రాంత ఉద్యోగులకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సంస్కృతిక నృత్యాలు అలరించాయి. అనంతరం విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో సుదీర్ఘ కాలంగా పని చేసిన విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వ పని తీరుపై ఎంతో అనుభవం ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాల్లో వారి సలహాలను ఇవ్వడం అభినందనీయమన్నారు. విశ్రాంత ఉద్యోగులకు అనేక సమస్యలున్నాయని వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. విశ్రాంత ఉద్యోగుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, ఆర్డీఓ అధికారిగా ఉండి వారి కష్టాలను తెలుసుకుంటున్నారన్నారు. పట్టణంలో వృద్ధాశ్రమం ఉందని, దాన్ని డే కేర్ సెంటర్ మార్చడం కోసం చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. త్వరలోనే స్వచ్ఛంద సంస్థలను గుర్తించి డే కేర్ సెంటర్‌ను మంత్రి సీతక్కతో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సినియర్ సిటిజన్ అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, కిష్టరెడ్డి, వైద్యులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులుగా ఎదగడానికి సీఎం కప్ తోడ్పడుతుంది



నవతెలంగాణ-నిర్మల్

గ్రామీణ స్థాయి నుండి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులుగా ఎదగడానికి సీఎం కప్ పోటీలు తోడ్పడుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడలలో చురుకుగా పాల్గొనాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడామైదానంలో రెండో రోజు క్రీడా పోటీలను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. బాక్సింగ్, హ్యాండ్ బాల్, నెట్ బాల్, చెస్, తైక్వాండో, కరాటే, ఆత్యా పాత్యా, ఎన్ఎస్ఏ అకాడమీలో బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహించారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా దాదాపు 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ రవీందర్ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి భోజన్న, వ్యాయామ ఉపాధ్యాయులు భూమన్న, బుచ్చి రామారావు, రమణారావు, స్వామి, భూమేష్, జమున, విజయలక్ష్మి, రాజేందర్, కవిత, సంజీవ్, సాయిరాజ్, ముకేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సమగ్ర నివేదికలు అందజేయాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సమగ్ర నివేదికలు అందజేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలపై తహసిల్దారులు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలపై సమగ్ర నివేదికలు అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, పరిపాలన అనుమతులు పొందినవి, పూర్తి అయినవి, ఇంకనూ నిర్మాణంలో ఉన్న వాటి పురోగతిపై సమగ్ర నివేదికలు అందించాలని సూచించారు. అలాగే ఇప్పటివరకు లబ్ధిదారులకు అందించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో విద్యుత్తు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండలాల వారీగా మంజూరై చేపట్టిన ఇండ్ల పురోగతిపై చర్చించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్న కళ్యాణి, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే మొక్కలను నాటాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా
- విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి
- ఇందిరమ్మ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ చట్టం కింద చేపట్టే పనుల్లో రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని ధనోర(బి), ఏమాయికుంట తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. హైస్కూల్ ఆరోగ్య పాఠశాల కింద అమలు చేసిన సూత్రాలను పాటించాలని, ఉపాధ్యాయులకు ఆదేశించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కిచెన్ షెడ్లలో వివిధ రకాల కూరగాయలను పండించాలన్నారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల ఇంటింటా సర్వేపై మొబైల్ యాప్ ద్వారా అప్ లోడ్ అయిన వివరాలను పరిశీలించారు. అనంతరం ఏమాయికుంట గ్రామంలో ఉపాధిహామీ నర్సరీని పరిశీలించారు. ఆ నర్సరీలో వేసిన మట్టి నమూనాలు, పెంచిన మొక్కల వివరాలను సెక్రటరీ ముండే రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సారి గల్మర్గ్ వంటి పూల మొక్కలే కాకుండా రైతులకు ఉపయోగపడే పండ్ల మొక్కలతో పాటు ఖర్జూర, బొప్పాయి, సీతాఫలం, మునక్కాయ, మామిడి వంటి ఉద్యానవన శాఖ మొక్కలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఆ గ్రామంలో స్వచ్ఛ భారత్ కింద నిర్మించిన మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు తదితర నిర్మాణాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఈ మరుగుదొడ్లను ఉపయోగించుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన వెంట డీఈఓ ప్రణీత, ఐటీడీఏ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, ఎంపీడీఓ కే.భాస్కర్, తహసీల్దార్ ఎం.ప్రవీణ్, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.



పెన్షనర్ల హక్కుల పరిరక్షణకు చర్యలు

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్



పెన్షనర్ల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాధిక, డీటీఓ సరోజతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నేటి జాతీయ పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమానికి హాజరైన పెన్షనర్లందరికి పెన్షనర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మీరు అందించిన సేవలను గౌరవించుకోవడం, అనుభవాలను పంచుకోవడం కోసం ప్రత్యేకమైన రోజు అని తెలిపారు. మీరు చేసిన కృషి, నిబద్ధత, అంకితభావం ఫలితంగానే సమాజం ఈ స్థాయికి చేరుకుందని అన్నారు. జిల్లాకు ఎన్నో సంవత్సరాలుగా చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. సీనియర్ సిటిజన్ యాక్ట్ ద్వారా హక్కులు, రక్షణను పొందవచ్చు అని తెలిపారు. సంక్షేమ వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు మీ అనుభవాలను వివరిస్తూ వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దేలా మీ విలువైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రతి రిటైర్డ్ ఉద్యోగి పెన్షన్ తీసుకోవడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని పెన్షన్ ఆర్థిక భద్రతనే కాకుండా జీవితానికి గౌరవాన్ని కలిగించేదని అన్నారు. నేటి సమాజంలో వయోవృద్ధులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ తరఫున చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీ విలువైన సలహాలు, జీవితానుభవాలతో నేటి తరానికి మార్గ నిర్దేశం చేయాలని కోరారు. అంతకుముందు పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఎంసీ లింగన్న మాట్లాడుతూ పెన్షనర్ల సంఘ భవనం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు జిల్లా కలెక్టర్ మంజూరు చేశారని తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సంక్షేమానికి పడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం మున్సిపల్ కార్మికులను, విశ్రాంత ఉద్యోగులను కలెక్టర్, అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, ఎస్టీఓ రమేష్, తహసీల్దార్ రాజు, సంఘం ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



బాల్యవివాహ రహిత భారతదేశంగా కృషి చేయాలి

- బాలల హక్కుల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆపదలో ఉన్న ఆడపిల్లలు ఎవరైనా గళం విప్పి చెబితే వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు వారికి అన్ని శాఖల తరపున రక్షణ కల్పించేందుకు పనిచేస్తున్నాయని జిల్లా బాలల హక్కుల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో షూర్ ఎన్జీఓ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాలకార్మికుల నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీపీఓ రాజేంద్రప్రసాద్, మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ పవర్ యశోద, సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్, సీడీపీఓ వనజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎంత కష్టమొచ్చినా చదువును మధ్యల ఆపివేయొద్దన్నారు. చదువులో, మరి ఏదైనా ఇబ్బంది వస్తే ధైర్యంగా తమ టీచర్లకు చెప్పుకోవాలన్నారు. ఆడపిల్లల రక్షణ కోసం 1098, 100, మహిళల కోసం 181 హెల్ప్ లైన్ నెంబర్లు, షీటీం సభ్యులు 24 గంటల పాటు పనిచేస్తున్నాయన్నారు. పిల్లల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలతో జీవితం అక్కడే ముగిసిపోతుందన్నారు. ఇందుకోసం పిల్లలందరూ ఎట్టి పరిస్థితుల్లో నాయనా చదువులు మధ్యలో మానివేయకుండా చదువును పూర్తి చేయాలన్నారు. బలవంతంగా పెళ్లికి తల్లితండ్రులు, బంధువులు ఎవరైనా ఇబ్బంది చేసిన 1098 హెల్ప్ లైన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరిహిన్ సుల్తానా, షూర్ ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ తోట సుమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ నిర్మల, విద్యార్థులు ఉన్నారు.



పాఠశాల సమయాల్లో మార్పు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతూ చలి తీవ్రత అధికంగా ఉందని, వాతావరణ శాఖ మరికొన్ని రోజులు చలి తీవ్రత ఉంటుందని తెలియజేసిన క్రమంలో పాఠశాలల సమయాల్లో మార్పు చేయాలని పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్ము కృష్ణకుమార్, నరసింహాస్వామి అన్నారు. మంగళవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందించారు. చలి ప్రభావంతో విద్యార్థులు ఉదయం పూట పాఠశాలకు రావడం, పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లడడంలో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చలి తీవ్రత తగ్గేవరకు జిల్లాలో పాఠశాలలు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3:30 నిమిషాల వరకు పనిచేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వగలరని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ దగ్గర ధర్నాకు వెళుతున్న కార్మికులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో పెట్టడం సరికాదని అన్నారు. వారి హక్కుల కోసం పోరాడే హక్కు వాళ్లకు ఉన్నదని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఎలక్షన్ల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో కార్మికులు సమ్మెకు పోవడానికి సిద్ధంగా ఉన్నారని వెంటనే గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానం రద్దు చేసి కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికునికి పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పీడీఎస్‌యూ నాయకుల ముందస్తు అరెస్టు



నవతెలంగాణ-జన్నారం

హైదరాబాదులోని మాసబ్ ట్యాంక్ వద్ద బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జరిగే ధర్నాకు వెళ్లకుండా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభంజనంను జన్నారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ప్రభంజనం మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన దోస్తు ఆన్‌లైన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఉన్నత విద్యా మండలి ముందు చేపట్టే ధర్నా కార్యక్రమానికి హాజరు కావడానికి వెళుతున్న సందర్భంలో పోలీసులు అరెస్టు చేయడం తగదన్నారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2వ సాధారణ ఎన్నికలు 2024 భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీల వారీగా ఫైనల్ పోలింగ్ కేంద్రాల జాబితాను నోటీస్ బోర్డ్‌పై ప్రదర్శనకు ఉంచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ షేక్ సప్దర్ అలీ, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీ నారాయణ, జూనియర్ సహాయకులు తిరుపతి పాల్గొన్నారు.

విడిపోయిన గూడ్స్ రైలు బోగీలు



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని రేచిని రోడ్డు-రేపల్లెవాడ రైల్వే స్టేషన్ మధ్యలో గూడ్స్ రైలు బోగీలు మధ్యలో విడిపోయాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కాగజ్ నగర్ నుంచి మంచిర్యాల వైపు వెళుతున్న గూడ్స్ రైలు బోగీలు అకస్మాత్తుగా విడిపోయి కొద్ది దూరం వెళ్లిపోయింది. సంబంధిత అధికారులు హుటాహుటిన రైలును నిలిపివేశారు. సంఘటనతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.